తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాలి



పురస్కారాలు అందజేస్తున్న ఎల్లూరి శివారెడ్డి, తనికెళ్ల భరణి, జె.చెన్నయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: తెలుగు భాషకు స్వరాష్ట్రాల్లో జరుగుతున్న నిరాదరణ వాంఛనీయం కాదని ప్రముఖ కవి, సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులో ఉన్న పాటి భాషాభిమానం కూడా మనకు లేదన్నారు. పిల్లలకు తెలుగు భాష ఒంటపట్టించే విషయంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, భాషకు పూర్వ వైభవం తీసుకురావాలని భరణి అన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన సభలో 2024వ సంవత్సరానికి 8 మంది సాహితీవేత్తలకు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, తనికెళ్ల భరణితో కలిసి పురస్కారాలు ప్రదానం చేశారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. డాక్టర్ వసుంధరారెడ్డి, ఆచార్య సుమతి నరేంద్ర, డాక్టర్ పి.లక్ష్మీరెడ్డి అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

విద్యార్థులు దైవభక్తిని అలవర్చుకోవాలి



విజేతలతో అన్వర్‌ఉల్‌హుదా, హిదాయత్ అలీఖాన్ తదితరులు

గోల్కొండ: విద్యార్థులు దైవభక్తిని అలవర్చుకోవాలని వీనస్ విద్యా సంస్థల డైరెక్టర్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. గత వారం నిర్వహించిన రాహే హిదాయత్ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారికి శనివారం ఆయన టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ ఆడిటోరియంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దైవ భక్తిని పెంచడానికే తాము పదేళ్లే రాహే హిదాయత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాహే హిదాయత్ కార్యక్రమంలో జనరల్ నాలెడ్జ్, నాత్‌తో పాటు దేశం, దేశభక్తి తదితర విషయాలపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి అన్వర్ ఉల్ ఉదా, అలయన్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ సయ్యద్ ఆరీఫ్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ తదితరులున్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా 1న జీతాలు ఇవ్వాలి

అబిడ్స్: ఉద్యోగులు, పెన్షనర్లకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు ఇవ్వాలని భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జి.రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ పేర్కొన్నారు. జీతభత్యాలు ప్రతినెలా 1న ఇస్తే ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు, కృష్ణ మాట్లాడుతూ..ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు ఆలస్యం కావడం ద్వారా వారు ఈఎంఐలు కాని, పర్సనల్ లోన్స్ కానీ, ఇంటి రుణాలు కానీ సకాలంలో ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి నెల 1వ తేదీనే జీతాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని వారు ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, ఎస్‌ఎం.జాఫ్రి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు రాజేశ్వర్‌రావ్ టి.కృష్ణ తదితరులు



మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్

‘డీజేలకు అనుమతులు లేవు’

గౌలిపురా: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్ అన్నారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..దసరా, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. శబ్ద కాలుష్యాన్ని కలుగజేసే డీజేలకు అనుమతి లేదని..ఒక వేళ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్సవాల నిర్వాహకులకు తెలియజేయాలని పోలీసులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అసత్య ప్రచారాలు చేసిన వారిపై ఫిర్యాదు

అఫ్జల్‌గంజ్: మాజీ మంత్రి కేటీఆర్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్న వారి పట్ల కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..కొంత మంది చిల్లర నాయకులు మాజీ మంత్రి కేటీఆర్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం దారుణమన్నారు. వారిని వదిలిపెట్టేది లేదన్నారు. కేసులు నమోదు చేసి వారి పట్ల చర్యలు తీసుకునేంత వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు కోటి శైలేష్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.



అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆశీష్‌కుమార్‌యాదవ్ తదితరులు

ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకల్లో బండి పద్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు అలరిస్తున్నాయి. శనివారం మున్నూరుకాపు మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మ ఆధ్వర్యంలో సాగిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు ఇందిరాశోభా, రమ్యారావు, మున్నూరుకాపు నేతలు పుట్నం పురుషోత్తమ్, కొత్త లక్ష్మణ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్: అమెరికాలోని ఆస్టిన్‌లో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణకు చెందిన పలువురు మహిళలు తెలంగాణ సాంప్రదాయంలో ముస్తాబై వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి సందడి చేశారు. ఈ వేడుకల్లో పాతబస్తీ మీరాలంమండికి చెందిన ఎన్నారై కల్పన కుటుంబ సభ్యులతో పాటు పలువురు మహిళలు పాల్గొనారు.



వేడుకల్లో ఎన్నారై కల్పన తదితరులు

షేక్‌పేట్ నాలా వద్ద ఫుట్‌పాత్‌పై వాహనాల అక్రమ పార్కింగ్



టోలిచౌకీ సమీపంలో ఫుట్‌పాత్‌పై ఇటుక, ఇసుక అమ్మకాలు



పాదచారికి దారేదీ?

- కబ్జాలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: లక్షలాది రూపాయల వ్యయంతో బల్దియా వారు పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కబ్జాకు గురవుతున్నాయి. పలు చోట్ల బడా షోరూమ్‌ల వారు, మరికొన్ని చోట్ల స్థానిక బడా నాయకుల అనుచరులు ఫుట్‌పాత్‌లను కబ్జా చేసుకున్నారు. వీటిని దర్జాగా కొందరు అద్దెలకు ఇస్తున్నారు. వివిధ రకాల వాహనాల షోరూమ్‌ల నిర్వాహకులు తమ సిబ్బందికి తమ స్టోర్ ముందు ఉన్న ఫుట్‌పాత్‌ను తమ వాహనాలను పార్కు చేసుకోవాలని హుకూం జారీ చేస్తున్నారు.

రోడ్డుపైనే రాకపోకలు..

- మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ రోడ్డు, గుడిమల్కాపూర్, టోలిచౌకీ, పాత ముంబై జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లు కబ్జా చెరలో ఉంటున్నాయి.
- పాత ముంబై జాతీయ రహదారి, సెవన్ టూంబ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మార్నింగ్ వాకర్స్‌కు ఫుట్‌పాత్‌లు అందుబాటులో ఉండడం లేదు.
- పాత ముంబై జాతీయ రహదారి మెహిదీపట్నం–టోలిచౌకీ రోడ్డు, మెహిదీపట్నం పాత చౌరస్తా–ఆసిఫ్‌నగర్ రోడ్డు ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీతో ఉంటాయి. ఈ మార్గాలలో పాదచారులు గత్యంతం లేక రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు.
- ప్రతినిత్యం తాము ఉదయం పూట వాకింగ్ చేస్తుంటామని అయితే ఫుట్‌పాత్‌లపై ఇటుక, ఇసుక, హైడర్లు గుట్టలుగా ఉంటున్నాయని గత్యంతరం లేక రోడ్డుపైనే వాకింగ్ చేస్తున్నామని సయ్యద్ ముస్తాక్ అనే మార్నింగ్ వాకర్ అంటున్నారు.

ఫుట్‌పాత్‌పైనే భవన నిర్మాణ సామగ్రి..

- టోలిచౌకీతో పాటు మరికొన్ని ప్రధాన రహదారుల ఫుట్‌పాత్‌లపై భవన నిర్మాణ సామగ్రి గుట్టలుగా పోసి అమ్ముతున్నారు. రోడ్డుపై ఇటుక, ఇసుకతో నిండిన మినీ ట్రక్కులు కూడా ఉంటున్నాయి. దీంతో రోడ్డు కాస్తా ఇరుకుగా మారుతున్నాయి.
- టోలిచౌకీ ఫ్లై ఓవర్ పక్కనే ఫుట్‌పాత్‌పై భవన నిర్మాణ సామగ్రి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. షేక్‌పేట్ నాలా వద్ద ఓ కారు షోరూమ్, సర్వీస్ సెంటర్ వారు తమ సిబ్బంది వాహనాలను బలవంతంగా ఫుట్‌పాత్‌పైనే పార్కింగ్ చేయిస్తున్నారు.
- టోలిచౌకీ–సెవన్ టూంబ్స్ రోడ్డుపై ఓ కారు సర్వీస్ షోరూమ్ ఉంది. ఈ షోరూమ్ సిబ్బంది మొత్తం తమ ద్విచక్ర వాహనాలు ఫుట్‌పాత్, రోడ్డుపై పార్కు చేసి ఉంచుతున్నారు.

హోటళ్ల ముందు సైతం...

- మెహిదీపట్నం హసన్ కేఫ్, సాలార్‌జంగ్ కాలనీలోని షాగౌస్ కేఫ్, టోలిచౌకీ చౌరస్తా వద్ద గల రూమాన్ హోటల్, అర్బాబ్ హోటళ్ల ముందు ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు వాహనాలు ఆటోలు పార్కు చేసి ఉంటాయి. రద్దీ వేళల్లో ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.
- సాలర్‌జంగ్ కాలనీలోని పశ్చిమ మండలం ఆర్‌టీఏ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చే వాహనాలు రోడ్డు మీదే నిలుచోని ఉంటున్నాయి. వాహనాల తనిఖీలు కూడా రోడ్డు మీదనే సాగుతున్నాయి.
- గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద కూడా హోటల్స్, రెస్టారెంట్ల ముందు ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కు చేసి ఉంటున్నాయి.
- ఇదిలా ఉండగా వాహనాల తనిఖీలు అంటూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు తనిఖీల్లో వాహనాదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అయితే హోటల్స్ ముందు ద్విచక్ర వాహనాలు, అక్రమ పార్కింగ్‌ను చూసీ చూడనట్లు ఉంటున్నారని పలువురు ద్విచక్ర వాహనాదారులు ఆరోపిస్తున్నారు.
- తనిఖీల్లో అక్రమ పార్కింగ్ అంటూ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ కబ్జాదారులను ఎందుకు వదిలేస్తున్నారని పలువురు వాహనాదారులు ప్రశ్నిస్తున్నారు.
- ఫుట్‌పాత్‌లను కబ్జా చెర నుంచి విడిపించి పాదచారులకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

సమాజ సేవలో యువత ముందుండాలి



స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో మహ్మద్ మజహర్

గోల్కొండ: సమాజ సేవలో యువత ముందుండాలని తెలంగాణ శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. యువజన కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ మజహర్ శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..యువకులు చురుగ్గా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ప్రజల మధ్య ఉండే యువత నాయకత్వ లక్షణాలు తొందరగా అలవర్చుకుంటారని ఆయన అన్నారు. రాజకీయాలను సొంత ప్రయోజనాలకు కాకుండా దేశ సేవగా భావించాలన్నారు.

ఆలయ పునర్ నిర్మాణ పనులు ప్రారంభం



పూజలు చేస్తున్న నాగేందర్ ముదిరాజ్, గిరిధర్ ముదిరాజ్, అశోక్‌కుమార్

అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయ సమీపంలో ఉన్న ప్రసన్నాంజనేయ ఆలయ పునర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టా నాగేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు గిరిధర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ పూజలు నిర్వహించి పనులు ప్రారంభం చేశారు. త్వరలోనే ఆలయాన్ని నూతన హంగులతో నిర్మిస్తామన్నారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ నాయకులు సత్యప్రకాష్ ముదిరాజ్, ఉమామహేశ్వర్, బాబా గౌడ్, మహేష్ ముదిరాజ్, పి.నాగేందర్‌కుమార్ పాల్గొన్నారు.

‘బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ అక్రమాలపై విచారణ జరిపించాలి’



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సర్దార్ వినోద్

గన్‌ఫౌండ్రీ: బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ అక్రమాలపై విచారణ జరిపించాలని ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు సర్దార్ వినోద్‌కుమార్, పి.ప్రశాంత్ కోరారు. ఈ మేరకు శనివారం రవీంద్ర భారతిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా బీఆర్‌ఎస్ హయాంలో నియమితులైన వెంకటరమణ నకిలీ బిల్లులతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఆయనను తక్షణమే రెండు పదవుల నుంచి తొలగించి విచారణ జరిపించాలని కోరారు.

వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

నాంపల్లి: మాజీ కేంద్ర మంత్రి, దివంగత గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయమని సింగరేణి జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని పేర్కొన్నారు. శనివారం సింగరేణి భవన్‌లో జరిగిన వెంకటస్వామి జయంత్యుత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వెంకటస్వామి ప్రత్యేక చొరవతోనే కార్మికులకు పెన్షన్ సౌకర్యం వర్తించిందని, అలాగే అనేక పరిశ్రమలలో కార్మికులకు మెరుగైన పథకాలు అమలు చేయడంలో వెంకటస్వామి ప్రత్యేక చొరవ చూపారని పేర్కొన్నారు. వెంకటస్వామి చిత్రపటానికి సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవి ప్రసాద్, జనరల్ మేనేజర్ శ్రీరాంపూర్ సంజీవ రెడ్డి, చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథరాజు, ఏజీఎం ఫైనాన్స్ చక్రవర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎస్ భాస్కర్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు



అఫ్జల్‌గంజ్: కాంట్రాక్టు వైద్యుల నియామకం కోసం ఉస్మానియా ఆసుపత్రిలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సభ్యులు ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (కాంట్రాక్టు వైద్యులు) భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కమిటీలో సభ్యులుగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్‌కుమార్, ఆర్‌ఎంఓ–1 డాక్టర్ జయకృష్ణ, ప్రొఫెసర్ కేఎంకే రెడ్డి, ప్రొఫెసర్ ప్రేమ్ సాగర్ ఉన్నారు. అదనపు కలెక్టర్ ఇంటర్వ్యూలను పరిశీలించారు. 20 పోస్టులకు గాను 133 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ తెలిపారు.

కృతజ్ఞతలు

గన్‌ఫౌండ్రీ: విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.13 లక్షల నిధులను మంజూరు చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల మాతృ సంఘం సంతోషం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లోని పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ..గత రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ సంవత్సరం యజ్ఞమహోత్సవానికి నిధులను మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్య కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ లాల్‌కోట వెంకటచారి ప్రధాన కార్యదర్శి చొల్లేగో కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తండ్రి అదృశ్యం



రెహన్



రబిహా



రయాజ్

సంతోష్‌నగర్: ఇద్దరు పిల్లలతో సహా తండ్రి అదృశ్యమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..షాన్‌బాగ్ ఈదిబజార్‌కు చెందిన ఆఫ్రీన్ బేగం, రెహాన్ అలీఖాన్ (43)లు దంపతులు. వీరికి రబిహా అలీఖాన్ (7), రయాజ్ అలీఖాన్ (5) సంతానం. రెహాన్ అలీఖాన్ రెండు నెలల క్రితం మరో పెళ్లి చేసుకుంటానని భార్యకు తెలపడంతో అప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత నెల 28న ఉదయం 7.30 గంటలకు రెహాన్ కూతురు రబిహాను బార్కాస్‌లోని కేంద్రీయ విద్యాలయం వదిలేశాడు. అనంతరం ఇంటికి వచ్చి 9 గంటలకు కుమారుడు రయాజ్‌ను స్కూల్‌లో వదిలేశాడు. సాయంత్రం పిల్లలను స్కూల్ నుంచి తీసుకురావాలని భార్య సూచించడంతో తీసుకొస్తానని వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన భార్య స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. తన భర్త, పిల్లలు కనిపించడం లేదని ఆఫ్రీన్ బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జయశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్సీ, ఇంటర్మీడియేట్ ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగి ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు విజయనగర్ కాలనీలో ఉన్న రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలతో నేరుగా హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 98854 77482, 89771 75394 లలో సంప్రదించవచ్చు.

మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం



మాట్లాడుతున్న మౌలానా ఆషీమ్ అష్రఫీ ఖాన్‌పూరీ

గోల్కొండ: మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని మౌలానా ఆషీమ్ అష్రఫీ ఖాన్‌పూరీ అన్నారు. గోల్కొండ సిరత్ కమిటీ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గోల్కొండ బాలాహిసార్ బస్టాప్ వద్ద వార్షిక జల్సా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకల మానవాలికి శాంతిని బోధించిన దైవదూత మహ్మద్ ప్రవక్త అన్నారు. ఈర్ష్యా, ద్వేషాలు, కోపతాపాలు లేకుండా జీవితం గడపాలన్నదే ప్రవక్త బోధనల సారాంశం అన్నారు. నేడు ఈర్ష్యా, ద్వేషాలు ప్రతి ఒక్కరికి పెరిగిపోతున్నాయని దీన్ని వల్ల ఎన్నో అనార్థాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, జల్సా కమిటీ అధ్యక్షుడు పాషాభాయ్, ప్రధాన కార్యదర్శి అజీజ్‌ఖాన్ పఠాన్, కమిటీ సభ్యులు బాబర్ అలీఖాన్, షకీల్ అలీఖాన్, అతీక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి



ధన్‌రాజ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న రోహిణ్ రెడ్డి

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రత్యేక కృషి చేస్తానని హైదరాబాద్ సెంట్రల్ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ధన్‌రాజ్‌ను ఖైరతాబాద్ జిల్లా నూతన ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ శనివారం ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ మాట్లాడుతూ.. ఖైరతాబాద్ నియోజకవర్గం నలుమూలలా కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పార్టీ పదవి అప్పగించిన అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



మాత్రేశ్వరీ పోచమ్మ



ఉప్పుగూడ అమ్మవారు



మహంకాళేశ్వరి అమ్మవారు



జియాగూడ మహంకాళి



గుడిమల్కాపూర్‌లో అమ్మవారు



గౌలిపురా వివేకనందనగర్‌లో..



బంగారు పాత్రతో సర్వభద్ర మండపం పూజ

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలు, చండీ హోమాలు నిర్వహించారు. మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



టోలిచౌకీలో పూజలు చేస్తున్న పూజారి సురేష్



పూజల్లో శ్రీకాంత్‌చారి దంపతులు



పటేల్‌నగర్ లో దాండియా ఆడుతున్న యువతీ యువకులు



సుల్తాన్‌షాహి ఆలయంలో.. రాకేష్ తివారి దంపతులు



పూజల్లో జనగామ మధుసూదన్ గౌడ్ దంపతులు



మీరాలంమండిలో సామూహిక కుంకుమార్చన



పూజల్లో కాశీ బుగ్గ బాబన్న, పాలెం వెంకటేష్



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు